

జోరుగా వడ్డీ వ్యాపారం!

వడ్డీ వ్యాపారం దందా జోరుగా సాగుతోంది. నిత్యం రూ.కోట్లల్లో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. 8లో▸



దుబ్బకుంట సంరక్షణకు..

'దుబ్బకుంట కబ్జాదారుల కంట' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు కదిలారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
బుధవారం (సాయంత్రం)	గురువారం (ఉదయం)
6:31	5:03

న్యూస్‌రీల్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్స్‌తో మాట్లాడుతున్న ఏసీపీ రాజు

ఇబ్రహీంపట్నం: శాంతిభద్రతలకు విఘాతం సృష్టించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్స్‌ను మంగళవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయానికి పిలిపించారు. వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గొడవలు, కొట్లాటలు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ మారయ్య తదితరులు పాల్గొన్నారు.

అవసరాలకు సరిపడా నీరు

- జలాశయాల్లో తగినంత నీటి నిల్వలు
- అదనపు జలాల కోసం ఎమర్జెన్సీ పంపింగ్
- ఆందోళన వద్దంటున్న జలమండలి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ తాగునీటి అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయని.. నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని జలమండలి మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టంగా చెప్పింది. ఓఆర్‌ఆర్ వరకు విస్తరించిన మహానగర వాసుల తాగునీటి అవసరాల కోసం జలమండలి.. నాగార్జున సాగర్ జలాశయం, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్-1, 2, 3 ద్వారా రోజుకి 270 ఎంజీడీల నీటిని తరలిస్తున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో డెడ్ స్టోరేజీ లెవల్ పైన (510 అడుగుల పైగా) 7.06 టీఎంసీల నీటి లభ్యత ఉంది. కాబట్టి, ఈ వేసవిలో నగరానికి తాగునీటి కొరత ఉండబోదని స్పష్టం చేసింది. మరోవైపు జూలై చివరి నాటికి సరిపడా నీరు సరఫరా చేసేందుకు ఎమర్జెన్సీ పంపింగ్ ఏర్పాట్లు పూర్తి కావొస్తున్నాయి. ఈక్రమంలో జలాశయంలో నీటి మట్టం 510 అడుగులకు చేరగానే.. ఈ ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నగరానికి సరిపడా నీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామని జలమండలి తెలిపింది. మరోవైపు గోదావరి జలాల కోసం ఎల్లంపల్లి జలాశయంలో డెడ్ స్టోరేజీ నుంచి నీటి అత్యవసర పంపింగ్ కోసం అవసరమైన ప్రక్రియ మొదలుపెట్టామని పేర్కొంది. దీంతో పాటు అవసరాన్ని బట్టి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల నుంచి అదనపు జలాలను తరలించేందుకు సమాయత్తమవుతున్నట్టు వివరించింది. సింగూరు, మంజీరా జలాశయాల్లో సంతృప్తికర నీటి నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళనలకు గురి కావొద్దని జలమండలి విజ్ఞప్తి చేసింది.

15న తాండూరుకు కేటీఆర్

తాండూరు: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఈ నెల 15న తాండూరుకు రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తాండూరు పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి కేటీఆర్‌తోపాటు మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్, ఉమ్మడి జిల్లా నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

18న బహిరంగ వేలం

అనంతగిరి: వికారాబాద్ పోలీసు శిక్షణ కేంద్రంలో పనికిరాని, పాత, చెడిపోయిన వస్తువులకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు వేలం ఉంటుందని, ఆసక్తిగల వారు పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 8712670028లో సంప్రదించాలని సూచించారు.

కరువు ఛాయలు!



మంచాల మండలం తిప్పాయిగూడలో పొలంలో మేస్తున్న పశువులు

పాతాళానికి పడిపోయిన భూగర్భజలాలు

- ఆగిన మోటార్లు.. ఎండుతున్న పంటలు
- ట్యాంకర్ల ద్వారా పొలాలకు నీరు సరఫరా
- సాగు నీటికే కాదు తాగునీటికి తప్పని కటకట

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కరువు మళ్లీ కోరలు చాస్తోంది. చేతికి అందివస్తుందనుకున్న వరి సహా పండ్ల తోటలు కళ్లముందే వాడిపోతున్నాయి. విధిలేని పరిస్థితుల్లో కొంత మంది రైతులు తమ పొలాల్లో పశువులను మేపు తుండగా, మరికొంత మంది చెరువుల నుంచి ట్యాంకర్లలో నీటిని తరలించి పంటలు ఎండిపోకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలోని మంచాల, యాచారం, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్, ఆమనగల్లు, కేశంపేట తదితర మండలాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఇప్పటికే మెజార్టీ బోర్లు ఎండిపోయాయి. పంటలను కాపాడుకునేందుకు పలువురు రైతులు బోర్లు వేస్తున్నారు. గతంలో 250 అడుగుల లోతులో కన్పించిన భూగర్భ జలాలు ప్రస్తుతం 500 అడుగుల లోతు వేసినా కన్పించడం లేదు. జిల్లాలో సాధారణ వర్షపాతం 660.5 మి.మీ కాగా, 656 మి.మీ మాత్రమే కురిసింది. ఐదు మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కాగా, మూడు మండలాల్లో సాధారణం కంటే తక్కువ నమోదైంది. 19 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లా భూగర్భ జలవనరుల శాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫీజో మీటర్లలో జనవరిలో 9.84 మీటర్ల లోతులో లభించిన నీటి ఆనవాళ్లు.. ఫిబ్రవరి నాటికి 12 మీటర్ల లోతుకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. మెజార్టీ పంటలు బోరుబావుల కిందే సాగవుతుండటం, భూగర్భ జలాలు వేగంగా పడిపోతుండటంతో బోర్లు పోయక పంటలు ఎండిపోతుండటాన్ని రైతులు జీర్ణించుకోలేక పోతున్నారు.

తగ్గిన దిగుబడి..పెరిగిన ధరలు

జిల్లాలో మొత్తం 2,132 చెరువులు, కుంటలు ఉండగా, వీటి పరిధిలో 70,067 ఎకరాల ఆయకట్టు ఉంది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 1,19,947 ఉండగా, వీటి పరిధిలో ప్రస్తుతం వరి సహా పండ్ల తోటలు 29,412 ఎకరాల్లో పండ్ల తోటలు, 15,715 ఎకరాల్లో కాయగూరల తోటలు, 3,108 ఎకరాల్లో పూల తోటలు, 673 ఎకరాల్లో సుగంధ ద్రవ్యాల పంటలు, 1,983 ఎకరాల్లో ఆగ్రోఫారెస్ట్‌లు, 167 ఎకరాల్లో పట్టు తోటలు సాగవుతున్నాయి. మోటార్లు పోయక సగానికిపైగా వరి పంట ఎండిపోయింది. కళ్ల ముందే పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పప్పు, ధాన్యాలతో పాటు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పూల దిగుమతి తగ్గిపోయి మార్కెట్లో వాటి ధరలు అమాంతం పెరిగి పోయాయి. ఆరు నెలల క్రితం వరకు క్వింటాల్ రైస్ రూ.4,000కే లభించగా ప్రస్తుతం రూ.6000పైగా అమ్ముతుండటం విశేషం. సాధారణంగా కొత్తిమీర, పుదీన, గోంగూర, పాలకూర, తోట కూరలు రూ.2కే కట్ట లభించేది. ప్రస్తుతం రూ.5 చెల్లిస్తే కానీ దొరకడం లేదు. గత నెల వరకు కిలో రూ.20 నుంచి రూ.30 లోపే అమ్మిన కూరగాయలు.. ప్రస్తుతం రూ.40 నుంచి రూ.60 వరకు పలుకుతున్నాయి. కేజీ రూ.120 నుంచి 150కే లభించిన చామంతి, గులాబీ పూలు ప్రస్తుతం రూ.350పైగా ధర పలుకుతుండటం గమనార్హం. ఇక పుచ్చ, తర్బూజా, జామ, ద్రాక్ష, మామిడి వంటి సీజన్ పండ్ల ధరలు కూడా రెట్టింపవడంతో కొనలేని పరిస్థితి.

తాగునీటికి తప్పని తిప్పలు

సాగు నీటికే కాదు తాగు నీటికీ తిప్పలు తప్పడం లేదు. మిషన్ భగీరథ ద్వారా కృష్ణా నీళ్లు సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా..ఆశించిన స్థాయిలో సరఫరా కావడం లేదు. మెజార్టీ పల్లెల్లో నాలుగైదు బిందెలకు మించి రావడం లేదు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు శివారు మున్సిపాలిటీల్లోనూ ఈ సమస్య ఎక్కువగా ఉంది. భూగర్భ జలాల నీటిమట్టం కూడా పడిపోవడంతో ఇంట్లోని బోర్లు పోయక.. ఇబ్బంది పడాల్సి వస్తోంది. హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, తుక్కుగూడ, నార్సింగి, మణికొండ, జల్‌పల్లి, శంకర్‌పల్లి, కొత్తూరు, శంషాబాద్, ఆమనగల్లు మున్సిపాలిటీల పరిధిలోని అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న వారు ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అదనుగా నిన్న మొన్నటి వరకు రూ.500 నుంచి రూ.700 తీసుకున్న ట్యాంకర్ నీటికి ప్రస్తుతం రూ.1000 నుంచి రూ.1,500 వసూలు చేస్తున్నారు.

జిల్లాలో పంటల సాగు (ఎకరాల్లో..)

పంట	వానాకాలం	యాసంగి
వరి	1,38,508	6,244
జొన్న	2,760	255
మొక్కజొన్న	60,022	1,178
పెసర	13	-
కంది	8,938	-
పత్తి	1,27,786	-
మినుములు	04	03
వేరుశనగ	334	5,378
ఆముదం	37	118
చెరుకు	64	-
సోయాబీన్	46	-
ఇతర పంటలు	18,593	7,613
మొత్తం	3,57,105	20,789

నాలుగు బోర్లు వేశా



నాకు ఆరు ఎకరాల భూమి ఉంది. నాలుగు బోర్లు వేశాను. ఐదు ఎకరాల్లో వరి సాగు చేశా. బోర్లు ఎండిపోవడంతో నాలుగున్నర ఎకరాల్లో పంట ఎండి పోయింది. ప్రస్తుతం అర ఎకరం మాత్రమే మిగిలింది.

– చందు నాయక్, ఎల్లమ్మ తండా, మంచాల

పూర్తిగా ఎండిపోయింది



ఉన్న ఎకరం పొలంలో వరి పంట సాగు చేశాను. ఇరవై రోజుల వరకు బోరు బాగానే పోసింది. ఎండలు విపరీతం కావడంతో బోరు పోయడం లేదు. వరి చేను కూడా పూర్తిగా ఎండిపోయింది.

– బాలు నాయక్, ఎల్లమ్మ తండా, మంచాల



చిలుకూరు రెవెన్యూలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్

భూ కబ్జాలు సహించేది లేదు

- మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్
- ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

మొయినాబాద్: ప్రభుత్వ భూముల జోలికొస్తే ఎంతటివారినైనా వదిలేది లేదని.. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెడతామని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని సర్వేనంబర్ 277లో, హిమాయత్‌నగర్ రెవెన్యూలోని సర్వేనంబర్ 151లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములను కబ్జాచేసి నిర్మాణాలు చేపడితే అధికారులు చూస్తూ ఊరుకోరన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములను కాపాడటం తమ బాధ్యత అని స్పష్టం చేశారు.

దురుసుగా ప్రవర్తించిన కబ్జాదారులు..

చిలుకూరు రెవెన్యూలోని సర్వేనంబర్ 277లో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌పై కొందరు కబ్జాదారులు దురుసుగా ప్రవర్తించారు. ప్రభుత్వ భూమి ఎక్కడెక్కడ కబ్జా అయిందని తహసీల్దార్ పరిశీలిస్తుండగా ఓ కబ్జాదారుడు వచ్చి మేం కబ్జా చేశామని ఎలా అంటావ్ అంటూ తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగాడు. మండల మెజిస్ట్రేట్ అయిన తహసీల్దార్‌ను బూతులు తిడుతూ ఆయనతోపాటు రెవెన్యూ సిబ్బందిపై దాడి చేసేందుకు యత్నించారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేయడమే కాకుండా తహసీల్దార్‌పైనే దాడికి యత్నిస్తారా అంటూ స్థానికులు కబ్జాదారులను అడ్డుకున్నారు.

లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట



అవార్డులు అందుకున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ ఆఫ్ మల్టీపుల్ 320 జిల్లా పరిధిలోని వివిధ లయన్స్‌క్లబ్‌లలో అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు ఉత్తమ లయన్స్‌క్లబ్‌గా, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ ఉత్తమ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్‌లోని కర్మాన్‌ఘాట్ ఏపీఆర్ గార్డెన్స్‌లో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ మల్టీపుల్ 320 రీజియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రీజియన్ లయన్స్‌క్లబ్ పరిధిలోని వివిధ క్లబ్‌ల్లో నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గాను అవార్డులు అందించారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు మొత్తం వివిధ విభాగాల్లో పది అవార్డులు లభించాయి. ఉత్తమ లయన్స్‌క్లబ్‌గా, ఉత్తమ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లుగౌడ్, ఉత్తమ కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా కొర్వి వెంకటయ్య, ఉత్తమ పీఆర్‌ఓగా పాషాకు అవార్డులు లభించాయి. బెస్ట్ మెగా హెల్త్‌క్యాంపు, బెస్ట్ బ్లడ్ డొనేషన్ క్యాంపు, బెస్ట్ ఐ క్యాంప్స్, బెస్ట్ మీల్స్ ఆన్ మీల్స్ తదితర విభాగాల్లో ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు అవార్డులు వచ్చాయి. అవార్డులను లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ సాధు ప్రభాకర్‌రెడ్డి అందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

మోదీ జేబు సంస్థలుగా బ్యాంకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

యాచారం: దేశంలోని బ్యాంకులు ప్రధాని మోదీ జేబు సంస్థలుగా మారాయని, సుప్రీం తీర్పులను సైతం లెక్కచేయడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పేర్కొన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో మంగళవారం పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవినీతి మయంగా మారిందని విమర్శించారు. ఎలక్షన్ కమిషన్ లెక్కల ప్రకారం 2018 నుంచి ఇప్పటి వరకు 30 విడతల్లో 28 వేల ఎన్నికల బాండ్లను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విక్రయించిందని, వాటి విలువ దాదాపు రూ.16 వేల కోట్లకు పైనేనని అన్నారు. అందులో బీజేపీ రూ.10,122 కోట్లు అందుకుందని, ఇది అవినీతి కాదా అని ప్రశ్నించారు. బ్యాంకుల ఆర్థిక కార్యకలాపాలన్నీ డిజిటలైజ్ చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించినా ఎస్‌బీఐలో స్పందన లేదన్నారు. ప్రధాని మోదీ ఒత్తిళ్లతోనే ఎస్‌బీఐ సక్రమంగా పనిచేయడం లేదని దుయ్యబట్టారు. మోదీకి కాపాలాదారుగా పనిచేస్తున్న ఎస్‌బీఐ చైర్మన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగుడాల యాదయ్య, బోడ సామేల్, జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెరువుల చెర వీడేనా..

- ఆక్రమణలకు అడ్డుకట్ట పడేనా?
- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం
- జిల్లాలో సర్వే ప్రారంభం
- తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు నుంచి షురూ

తుర్కయంజాల్: ఆక్రమణకు గురవుతున్న చెరువులు, కుంటలను కాపాడటంతో పాటు ఇప్పటి వరకు అన్యాక్రాంతమైన వాటిని గుర్తించడం.. పూర్తి స్థాయి నీటి మట్టం పరిధి.. బఫర్ జోన్ నిర్ధారించే ప్రక్రియ ఎట్టకేలకు సోమవారం జిల్లాలో ప్రారంభమైంది. దీంతో ఇన్ని రోజుల పాటు అడ్డూ అదుపు లేకుండా కొనసాగిన చెరువులు, కుంటలు, వాగులు, వంకల ఆక్రమణకు ఇకనైనా అడ్డుకట్ట పడనుందా అన్న చర్చ మొదలైంది. చెరువులు, కుంటల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని భావించిన కలెక్టర్ శశాంక ఇటీవల ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆక్రమణలకు గురవుతున్న చెరువులను ముందుగా సర్వే చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా జిల్లాలోని పెద్ద చెరువుల్లో ఒకటైన తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు పరిధిలో మంగళవారం ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు సంయుక్తంగా సర్వే ప్రారంభించారు.

జిల్లాలో 2,132 చెరువులు

జిల్లాలో మొత్తం 2,132 చెరువులు, కుంటలు ఉండగా, 10,946 ఎంఎఫ్‌టీ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. వీటి పరిధిలో 70,067 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి ద్వారా ఏటా 400 టన్నులకు పైబడి చేపల దిగుబడి వస్తుంది. చెరువులకు ఎఫ్‌టీఎల్ నిర్ధారించి ఆక్రమణలకు గురికాకుండా కాపాడాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరించారు. ఇష్టానుసారంగా నిరభ్యంతర పత్రాలు జారీచేసి అనేక చెరువులు, కుంటల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టుకురావడానికి కారణం అయ్యారు. 2016లో తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి సర్వే నంబర్ 205లోని 12 ఎకరాల భూమికి ఎన్‌ఓసీ జారీచేశారు. ఏడాది క్రితం ఆ భూమిలో 5 అడుగుల కంటే ఎక్కువగా నీరు నిలిచి ఉండగా వందల కొద్ది టిప్పర్ల సాయంతో పెద్దపెద్ద బండరాళ్లు, మట్టిని నింపి పూడ్చివేశారు. దీనిపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించడంతో స్థానికంగా ఇది ఉద్యమానికి దారితీసింది. అయినా అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుని చేతులు దులుపుకొన్నారు. ఆ సమయంలో అధికారులపై పెద్ద ఎత్తున అవినీతి, ఆరోపణలు వచ్చాయి.

అక్రమాల పుట్ట బయట పడేనా?

320 ఎకరాల శిఖం భూమి, 179 ఎకరాల పట్టా భూముల్లో మాసబ్ చెరువు విస్తరించి ఉంది. ఈ చెరువు పరిధిలో సుమారు 100 ఎకరాలకు పైగా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇప్పటికే పలు వెంచర్లు వెలిశాయి. 2020లో పలు నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. ఈ చెరువు పరిధిలోని సర్వే నంబర్లు 58, 59, 60, 61, 62, 63, 64, 65, 69, 77, 73, 109, 110, 113, 94, 100, 101, 103, 38, 37, 35, 36, 205, 204, 159, 203, 162, 163, 164, 165తో పాటు పలు సర్వే నంబర్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇప్పటికే పలు వెంచర్లు చేసి అమాయకులకు ప్లాట్లు విక్రయించారు. అధికారులు పక్కాగా సర్వే నిర్వహించి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ణయిస్తే అక్రమార్కుల చిట్టా మొత్తం బయట పడే అవకాశం ఉందని భావిస్తున్నారు.



మాసబ్ చెరువు వద్ద సర్వే చేపడుతున్న అధికారులు

జిల్లాలో ఉన్న చెరువులు, కుంటలు, ఆయకట్టు వివరాలు

చెరువులు	డివిజన్-1	డివిజన్-2	చేవెళ్ల	షాద్‌నగర్	కల్వకుర్తి
100కు పైగా	60	376	203	28	18
100లోపు	732	-	-	432	280
సామర్థ్యం	6,046.28	1,104	913	1,322.22	1,560.9
ఆయకట్టు	31,936.28	7,850	6,845	13,265.23	10,170.28

భవనం పైనుంచి పడి కూలీ దుర్మరణం



మల్లేశ్ మృతదేహం

మొయినాబాద్: నిర్మాణంలో ఉన్న భవనం రెండో అంతస్తు పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ కూలి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చిన్నమంగళారంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన వడ్డె మల్లేశ్ (30) కొన్నేళ్లుగా తన అత్తగారి ఊరైన చిన్నమంగళారంలో ఉంటూ కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చిన్నమంగళారంలో బిజిలి ఎల్లేష్ నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. ఎల్లేశ్ నిర్మిస్తున్న భవనంలో మంగళవారం మల్లేశ్ కూలీ పని చేసేందుకు వెళ్లాడు. రెండో అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యమేనని గ్రామస్తుల ఆరోపణ

చిన్నమంగళారంలో నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి జారి పడి కూలీ మృతి చెందడానికి పంచాయతీ అధికారుల నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు ఆరోపించారు. నిబంధనల ప్రకారం పంచాయతీ పరిధిలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడానికి వీల్లేదు. కానీ ఎల్లేశ్ నాలుగంతస్తుల భవనం నిర్మిస్తున్నా పంచాయతీ కార్యదర్శి, ఇతర అధికారులు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. బహుళ అంతస్తులకు అనుమతులు ఎవరిచ్చారని మండిపడ్డారు. గ్రామాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అధికారులు పట్టించుకోకపోవడంతోనే తరచూ ఇలాంటి ప్రమాదాలు జరిగి అమాయక కూలీలు బలవుతున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాచారం: వ్యవసాయ క్షేత్రంలో పేకాట రాయుళ్లను సోమవారం రాత్రి ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. యాచారం–మొండిగౌరెల్లి గ్రామాల మధ్యన ఓ వ్యవసాయ క్షేత్రంలో పేకాటాడుతున్నట్లు ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. స్థావరంపై దాడి చేసిన పోలీసులు పేకాటాడుతున్న 9 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద రూ.77,110 నగదు, పది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని యాచారం పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న సీఐ శంకర్‌కుమార్ మంగళవారం రిమాండ్‌కు పంపించారు.

జోరుగా వడ్డీ వ్యాపారం!

వడ్డీ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న రీతిలో సాగుతోంది. వ్యక్తి అవసరాన్ని లక్ష్యంగా చేసుకొని వ్యాపారులు అధిక వడ్డీకి అప్పులు ఇస్తున్నారు. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో ఈ దందాకి అడ్డూఅదుపు లేకుండా పోయింది.

- వందకు రూ.ఐదు ఇంట్రెస్ట్ తీసుకుంటున్న వ్యాపారులు
- ముందస్తుగా భూముల రిజిస్ట్రేషన్లు
- రియల్ ఎస్టేట్ కేంద్రంగా సాగుతున్న దందా

యాచారం: ఇబ్రహీంపట్నం డివిజన్‌లో వడ్డీ వ్యాపారం దందా జోరుగా సాగుతోంది. నిత్యం రూ.కోట్లల్లో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. ఆరు నెలలుగా రియల్ వ్యాపారం నెమ్మదించింది. దీంతో భూముల కొనుగోలుకు చేసిన అప్పులు వ్యాపారులకు గుదిబండగా మారాయి. భూములు అమ్ముడు పోక చేసిన అప్పులు తీర్చక స్థిరాస్తి వ్యాపారులు వడ్డీ అప్పులను ఆశ్రయిస్తున్నారు. రంగారెడ్డి–నల్గొండ జిల్లాల సరిహద్దు కేంద్రంగా వడ్డీ దందా జోరుగా సాగుతుంది. వడ్డీలకు అప్పులిచ్చే వ్యాపారులు ఓ జట్టుగా ఏర్పడి మాల్ కేంద్రంగా యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, మాడ్గుల్, కందుకూర్, ఆమన్‌గల్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పాత పరిచయాలను ఆసరాగా చేసుకుని వ్యాపారుల యోగక్షేమాలను తెలుసుకుంటారు. తోటి వ్యాపారుల ఆర్థిక పరిస్థితి బాగుందంటే సరి.. లేదంటే వడ్డీకి అప్పులిస్తాం.. భూములు, ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేస్తారా అని అడుగుతారు. అప్పుల్లో కూరుకుపోయిన వ్యాపారులు తక్షణ ఉపశమనం కోసం వడ్డీ ఎంతైనా సరే డబ్బులు తీసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు.

ముందస్తుగా రిజిస్ట్రేషన్

అప్పుల కావాల్సిన వారి భూములు, ప్లాట్లను వడ్డీ వ్యాపారులు ముందే సందర్శించి మార్కెట్లో వాటి విలువ తెలుసుకుంటారు. దానిలో సగం డబ్బులనే చెల్లించడానికి ఒప్పందం చేసుకుంటారు. అన్నీ కుదిరితే రూ.వందకు రూ.5 వడ్డీకి అప్పు ఇవ్వడానికి సిద్ధమవుతారు. వ్యక్తి అవసరాన్ని బట్టి వడ్డీని పెంచుతున్నారు. దీంతో పాటు రిజిస్ట్రేషన్ల చార్జీలు కూడా అప్పులు తీసుకునే వారే భరించాలి. ఇలా నిత్యం 20 నుంచి 30కి పైగానే రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. రోజూ వడ్డీ దందా రూ.10 కోట్లకు పైగా సాగుతుంది. యాచారం, కందుకూరు మండలాల్లో ఐదారు టీంలు వడ్డీకి అప్పును రూ.కోట్లల్లో ఇస్తున్నాయి.


నిలిచిన విక్రయాలు

అసెంబ్లీ ఎన్నికలకు ముందు రియల్ వ్యాపారం జోరుగా సాగేది. వ్యవసాయ భూములు, ప్లాట్ల విక్రయాల్లో మంచి లాభాలు రావడంతో వ్యాపారులు అప్పులు చేసి మరిన్ని భూములు కొనుగోలు చేశారు. తాజాగా రెండు, మూడు నెలలుగా రియల్ వ్యాపారం మందగించింది. వందలాది ఎకరాల్లో హెచ్‌ఎండీఏ, డీటీసీపీ నిబంధనల ప్రకారమే వెంచర్లు చేశారు. భూములు కొనడానికి, వెంచర్లుగా అభివృద్ధి చేయడానికి రియల్ వ్యాపారులు రూ.కోట్లల్లో అప్పులు చేశారు. ప్రస్తుతం కొనుగోలు చేసి వ్యవసాయ భూములతో పాటు, వెంచర్లల్లో ప్లాట్లు అమ్ముడు పోవడం లేదు. మండలంలోని ప్రముఖ రియల్ వ్యాపార కంపెనీలు వందలాది ఎకరాల్లో వెంచర్లు ఏర్పాటు చేశాయి. కానీ ప్లాట్ల విక్రయాలు లేక అభివృద్ధి పనులను వదిలేశారు.



నందివనపర్తిలో ప్లాట్ల విక్రయాలు లేక ఓ వెంచర్‌లో నిలిచిపోయిన పనులు

చర్యలు తీసుకుంటాం



వ్యాపారులు అధిక అప్పులు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. అప్పులు ఉంటే భూములు, ప్లాట్లు విక్రయించి తీర్చుకోవాలి. డబ్బులు ఆశ చూపి అధిక వడ్డీకి అప్పులు ఇచ్చి రైతులను ఇబ్బంది పాలు చేసే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– శంకర్‌కుమార్, సీఐ, యాచారం

పవిత్ర మాసం.. పసందుగా విందు

ఆమనగల్లు: పట్టణంలో రంజాన్ మాసం ఉపవాస దీక్షల ప్రారంభం సందర్భంగా మంగళవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నాయకుడు జబ్బార్ నివాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణంలోని పలు మసీదులలో ప్రార్థనల అనంతరం ముస్లింలు నేరుగా ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇఫ్తార్ విందు నిర్వాహకులు ఖాదర్, కరీం, రహీం, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, ఖలీల్, బిక్యానాయక్, జగన్, మానయ్య, మాసూం, గౌస్, ఖాదర్‌ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కాలువ కబ్జాపై చర్యలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఫిరంగి నాలా కబ్జాపై అధికార యంత్రాంగం కదిలింది. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఆదిబట్లకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తరలివచ్చారు. కబ్జాకు గురైన ఫిరంగి నాలాను పరిశీలించారు. అనంతరం సర్వే నిర్వహించి కబ్జాను గుర్తించారు. ఫిరంగి నాలాలో మట్టి పోసి రోడ్డు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీబీతో రోడ్డును ధ్వంసం చేశారు. మున్సిపాలిటీలోని ఫిరంగి నాలాపై మట్టి పోయడం తగదని కబ్జారాయుళ్లను హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు రాజ్యలక్ష్మి, కృష్ణ, సాయికిరణ్‌రెడ్డిలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



నాలాలో వేసిన రోడ్డును తొలగిస్తున్న అధికారులు

కూతురు పెళ్లికి దాచిన నగదు చోరీ

రూ.2.95 లక్షల అపహరణ, కేసు నమోదు

మీర్‌పేట: రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి ఆ కుటుంబానిది. పొట్ట చేత్తో పట్టుకొని నగరానికి వచ్చారు. కుమార్తె పెళ్లి కోసం పైసా పైసా కూడబెట్టి దాచుకున్న నగదును దొంగలు ఎత్తుకెళ్లడంతో తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం జూరాల గ్రామానికి చెందిన గుండాల పద్మ, హనుమంతు దంపతులు రెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చారు. హస్తినాపురంలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే నివాసముంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మంగళవారం తెల్లవారుజామున అందరూ నిద్రిస్తుండగా ఇద్దరు దొంగలు ఇంట్లోకి చొరబడి రూ.2.95 లక్షల నగదు, తులం బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, డిగ్రీ సర్టిఫికెట్లు ఎత్తుకెళ్లారు. ఉదయం లేచేసరికి దొంగతనం జరిగినట్లు గ్రహించిన పద్మ వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు చోరీ జరిగిన ఇంటి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించి, క్లూస్‌టీం ద్వారా ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



చిందరవందరగా పడేసిన సామగ్రి

కుమార్తె పెళ్లి కోసమని కాయాకష్టం చేసి దాచిన నగదును దొంగలు ఎత్తుకెళ్లారని పద్మ విలపిస్తోంది. నగదుతో పాటు ఆభరణాలు, ఇద్దరు పిల్లల డిగ్రీ సర్టిఫికెట్లు కూడా తీసుకెళ్లారని, తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకుంది.

అంత్యక్రియలకు వెళ్లివస్తూ.. అనంత లోకాలకు

ఆటో అదుపు తప్పి వ్యక్తి దుర్మరణం

షాద్‌నగర్‌రూరల్: అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం షాద్‌నగర్ పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని రాంనగర్ కాలనీకి చెందిన నర్సింహ(38) బంధువు కిషన్‌నగర్ గ్రామంలో మృతి చెందారు. నర్సింహ కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో గ్రామానికి వెళ్లాడు. అంత్యక్రియలు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నర్సింహ అక్కడికక్కడే మృతి చెందగా, లక్ష్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ ప్రతాప్‌లింగం తెలిపారు.



మృతి చెందిన నర్సింహ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చేవెళ్ల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని కందవాడ గ్రామానికి చెందిన కావలి యాదయ్య(55) మొయినాబాద్ మండలంలోని వీజేఐటీ కళాశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా యాదయ్య మల్కాపూర్ బస్‌స్టేజీ తరువాత అతని ద్విచక్రవాహనం అదుపు తప్పి మర్రి చెట్టును ఢీకొట్టింది. దీంతో అతడు ఎగిరి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి యాదయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దైవ దర్శనానికి వెళ్లిన గృహిణి అదృశ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: దైవ దర్శనానికి వెళ్లిన ఓ మహిళ కనిపించకుండా పోయింది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నాదర్‌గుల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలో పంకజ్‌కుమార్ భార్య మంకాల అనుషతో నివాసం ఉండేవారు. గత ఐదు నెలలుగా చెర్వుగట్టుకు అనుష వెళ్లి వస్తుంది. అదే క్రమంలో సోమవారం కూడా చెర్వుగట్టుకు వెళ్లింది. కానీ తిరిగి రాలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మంకాల అనుష (ఫైల్)

కబేళాకు తరలిస్తున్న గోవుల అడ్డగింత

చేవెళ్ల: మూగజీవాలను అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు చేగూరి భోజిరెడ్డి, గోరక్షదళ్ రాష్ట్ర సభ్యుడు రాఘవజీగోమాత కోరారు. మండల కేంద్రం మీదుగా సోమవారం రాత్రి అక్రమంగా పశువులను కబేళాలకు తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు వారు చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గోవులను అక్రమంగా రవాణా చేస్తే గోరక్షదళ్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దల్ లాంటి సంస్థలు అడ్డుకుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సురేందర్, సాయిరాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేశ్ ఉన్నారు.



సీఐకి ఫిర్యాదు చేస్తున్న విశ్వహిందూ పరిషత్, గోరక్షదళ్ సభ్యులు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్ శివాలయం సమీపంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మద్యం తాగి రోడ్డుపై నిద్రిస్తున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం అతని కాళ్లపై నుంచి వెళ్లింది. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: బాలిక అదృశ్యమైన సంఘటన మంగళవారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ మెట్రోసిటీ కాలనీలో నివాసం ఉంటున్న రామావత్ చందు కుమార్తె(14) సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాక పోవడంతో ఆచూకీ కోసం వెతికిన లభ్యం కాలేదు. దీంతో బాలిక తండ్రి నవీన్ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొత్తూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తూరు పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల మేరకు.. పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న నాట్కో కూడలి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు పరిశీలించగా అతడు మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలతో శంషాబాద్ మండలం రాళ్లగూడకు చెందిన భిక్షపతి(67)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనపై మృతుడి భార్య దేవరై రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఆలయ భూముల సర్వే పూర్తి



అన్యాక్రాంతమైన భూమిని పరిశీలిస్తున్న నరేందర్, సంజయ్‌యాదవ్

శంషాబాద్: పట్టణంలోని శ్రీరామచంద్రజీ దేవస్థానానికి చెందిన సర్వేనంబర్ 668 లో చేపట్టిన ఏడీ సర్వే మంగళవారం పూర్తయ్యింది. ఆలయానికి చెందిన 7.18 గుంటల భూమిని గుర్తించారు. కొంత భూమి అన్యాక్రాంతమైందని కాంగ్రెస్, బీజేపీ నేతలు రెండేళ్లుగా అధికారులకు వినతి పత్రాలు అందజేయడంతో పాటు ఆందోళనకు దిగారు. దీంతో సర్వే చేపట్టగా ఆలయం పక్కనే ఉన్న ఓ బిల్డర్‌కు సంబంధించిన కట్టడాల్లో 1200 గజాలు, మరో పక్కన ఉన్న పెట్రోలు పంపులో 4 గుంటల భూమి ఉన్నట్లు తేల్చారు. సర్వే పనులను పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ దగ్గరుండి పర్యవేక్షించారు. అన్యాక్రాంతమైన భూమిని వెంటనే ఎండోమెంట్ అధికారులు స్వాధీనం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

'దుబ్బకుంట' సంరక్షణకు చర్యలు



కుంట వద్ద చర్చించుకుంటున్న అధికారులు

పరిశీలించిన తహసీల్దార్ రవీందర్‌దత్

తుర్కయంజాల్: 'దుబ్బకుంట కబ్జాదారుల కంట' అంటూ సాక్షి ప్రచురించిన కథనానికి అధికారులు కదిలారు. మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్ కుంటను పరిశీలించారు. ఈ నెల 18న పూర్తిస్థాయి సర్వే చేయించి సర్వే నంబర్ 631లో ఉన్న ప్రభుత్వ భూమి 88 ఎకరాలకు హద్దులు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి సిబ్బందితో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన స్థానికులు

దుబ్బకుంటను కాపాడాలని కోరుతూ స్థానికులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న కుంటను రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూర్తిగా ఆక్రమించి ప్లాట్లుగా మార్చారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కుంటను సంరక్షించే చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు.

సీలింగ్ భూమిలో ప్రహరీ కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

నందిగామ: మండల శివారులోని మేకగూడ రోడ్డు వద్ద సీలింగ్ భూమిలో వేసిన ప్రహరీ గోడను రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. గ్రామ శివారులోని సర్వే నం. 621/3 లో 1.27 ఎకరాల భూమిని గతంలో ప్రభుత్వం గ్రామానికి చెందిన మంగళి లింగమయ్యకు కేటాయించింది. దీనిని 2005లో మరొకరు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ సైతం చేసుకున్నారు. ఇటీవల ఆ భూమికి ప్రీకాస్ట్‌తో ప్రహరీని నిర్మిస్తుండగా విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఈ నెల 7న 'సాక్షి'లో సీలింగ్ భూమికి ప్రహరీ అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్థానిక తహసీల్దారు రాజేశ్వర్ స్పందించి నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు జరిగిందని, ఇట్టి భూమిని క్రయ విక్రయాలు చేయకూడదన్నారు. ఒకవేళ చేసినట్లయితే పీఓటీ యాక్ట్ ప్రకారం ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకుంటుందని చెప్పారు. కాగా మంగళవారం ఆర్ఐ రోజా ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు జేసీబీ సహాయంతో ప్రహరీని కూల్చి వేశారు.



సీలింగ్ భూమిలో తొలగించిన గోడ

దండు కదిలి.. నేత్రపర్వంగా సాగి

మండలంలోని తిమ్మారెడ్డిగూడలో మంగళవారం ఎల్లమ్మ బోనాలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తులు బారులు తీరి గ్రామదేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మల్లేశ్, మాజీ సర్పంచ్ శకుంతలపాండు, ఎంపీటీసీ సునితారామస్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. – షాబాద్



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు